
డిటెక్టివ్ కథ

# మోనాలిసా

- రియా

ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద దొంగతనమది. అయినా యిరవై ఒక్క ఏళ్లపాటు ఆ విషయాన్ని తొక్కిపెట్టి వుంచారు అధికారులు. ఆ దొంగలెవరు? ఆ పని ఎలా చెయ్యగలిగారు? అసలా ప్లాన్ వేసిందెవరు? వగైరా విషయాలు చాలామందికి తెలియవు. లియోనార్డో డావించి గీసిన 'మోనాలిసా' ఫ్రాన్స్‌లోని లూర్ (Lourre) మ్యూజియం నుండి ఆగస్టు 21, 1911 నాడు దొంగిలించబడింది. అప్పటికి దాని ఖరీదు 5 లక్షల డాలర్లు. ఆ ఒక్క బొమ్మతో ఎంతమంది కోటీశ్వరులయ్యారో. మొత్తం మీద, ఆ తర్వాత మరే దొంగతనమూ చెయ్యక్కర్లేదు. విలాసవంతమైన కొనుక్కుని, నచ్చిన సుందరాంగిని పెళ్లి చేసుకుని, నౌకర్లు చాకర్లతో కాలుమీద కాలు వేసుకుని హాయిగా గడపొచ్చు. "అసలు కథ నీకు తెలియదు. రెండేళ్ల తర్వాత ఆ దొంగ రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డాడు. బొమ్మ మళ్లీ మ్యూజియంకే చేరింది. చోరాగ్రేసురుడు మూడేళ్లు జైల్లో గడిపాడు గదా" అంటారు మీరు. అవునా?



అవును. అధికారికంగా – అంటే అధికారులిచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం – అందరికీ తెలిసిందదే. బొమ్మ దొరికింది. దొంగ పట్టుబడ్డాడు. కటకటాలు లెక్కపెట్టాడు. అన్నీ నిజమే. కాని నేను మాట్లాడుతున్నది మోనాలిసా గురించి.

'సిల్లీ'గా కనిపించిన ఈ దొంగతనం వెనక ఒక అంతర్జాతీయ మాఫియా హస్తం వుందనీ, కొన్ని బిలియన్ల డాలర్లు చేతులు మారాయనీ బహుశా మీకు తెలిసుండకపోవచ్చు. ఈ రహస్యం నాకెలా చేరిందంటారా? ఆ మాఫియాలోని ముఖ్యులందరూ మరణించిన కొన్ని సంవత్సరాలక్కాని పత్రి కల వాళ్లకీ విషయం 'లీక్' చెయ్యొద్దని నిర్ణయం జరిగిందప్పుడే.

సృజనాత్మకత వున్న వాళ్లే కళాసృష్టి చెయ్యగలరని మీకు తెలుసుగా. మరి ఈ చోరకళాగ్రేసరుడు ఎంతగొప్ప స్రష్ట, ద్రష్ట అయివుంటాడు! 'మోనాలిసా'ను గీసిన డావించి జీనియస్ అనుకుంటే, దాన్ని దొంగిలించిన వాడు అంతకన్నా పెద్ద జీనియస్. ఇక ఆ కథాక్రమం వింటారా!

దొంగతనం చేసినవాళ్లకు మొదట్లో దాన్ని అమ్మే ఉద్దేశం లేదు. అంతటి అపురూపచిత్రాన్ని దొంగిలించడంలో వున్న 'థ్రిల్' కోసమే చేశారు. కొన్నాళ్లది కనిపించకుండా వుంటే ప్రపంచ వ్యాప్తంగా కళాభిమానుల్లో చెలరేగే కలకలం చూసి ఆనందిద్దామనుకున్నారు. నిజానికి దాన్ని ఎవరు మాత్ర మేం చేసుకుంటారు. ఎవరి వద్ద వున్నా అదో తెల్ల ఏనుగే (వైట్ ఎలిఫెంట్) గద. ప్రపంచంలోని అన్ని దేశాల కరెన్సీ నోట్లన్నీ ఒకచోట గుట్టగా పోసినా దాని విలువ చెయ్యవు. కొన్నాళ్లు ఈ 'తమాషా' చూసి తామే స్వయంగా మ్యూజియంకు తిరిగి యిద్దామని కూడా అనుకున్నారు. కాని, అనుకోకుండా ఆ బృందంలోని సభ్యుడొకడు (వాడికి ముఖ్యబాధ్యతలు కూడా అప్పగించలేదు) దాన్ని తీసుకుని పారిపోయాడు. ఆ బొమ్మను దోచటం అసంభవం. 'వాణ్ణి వెదికి పట్టుకునే ప్రయత్నంలో తాము పోలీసులకు చిక్కితే మరీ ప్రమాదం'' అనుకుని వాడి ఖర్మానికి వాణ్ణి వదిలేశారు. ఎట్లాగూ కొద్ది రోజుల్లో పోలీసులకు చిక్కకపోడు.

ఈ కథ నేను 1914లో కాసాబ్లాంకా (మొరాకో)లో చలికివణుకుతూ జనవరి నెలలో విన్నాను. మొరాకో ఉష్ణదేశమని మీకు తెలిసే వుంటుంది.

చెమటలు పట్టటమే తప్పు చలివెయ్యటముండ దక్కడ. అందువల్ల గదుల్లో హీటర్లుండవు. ఎప్పుడైనా సడెన్‌గా కోల్డ్‌వేవ్ వచ్చి టెంపరేచర్, 50 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పడిపోయిందనుకోండి. ఇక జనం కష్టాలు వర్ణనాతీతం. అప్పటికి మొదటి ప్రపంచ యుద్ధమింకా ప్రారంభం కాలేదు. అమెరికాలో ఫ్లొరిడాలాగ, మొరాకోలో కాస్లాబ్లాంకా విలాస నగరంగా రూపు దిద్దుకుంటున్నది. రియల్ ఎస్టేట్‌ధరలు ఆకాశంలోకి దూసుకు పోతున్నాయి. కాస్త తెలివిగా లావాదేవీలు జరపగలిగితే ఏడాది తిరక్కుండానే పెట్టుబడికి పదింతలు ఆర్జించవచ్చు. సరిగ్గా, ఆ పరిస్థితుల్లో, కొన్ని మిలియన్లు పట్టుకుని తన అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి వచ్చిన నా పాత మిత్రుడొకడు తారసపడ్డాడు. కొన్నాళ్లు అర్జెంటీనాలో వుండి, అమెరికాకు వచ్చాడని తెలుసు. ఒకనాడు మేం, ఆ చలిలో, విస్కీ తాగుతూ కూర్చున్నప్పుడు అతడు చెప్పిన కథ యిది:

''కరెన్సీ ఫోర్జరీ నువ్వు విన్నావు. నకిలీ పత్రాలు సృష్టించటం గురించి కూడా తెలిసే వుంటుంది. అలాగే, కళాప్రపంచంలో, ప్రసిద్ధ చిత్రాలకు, కాపీలు తయారుచేసి వాటినే ఒరిజినల్స్‌గా అమ్మటం కూడా అనేక శతాబ్దాలుగా కొనసాగుతున్నది. నిజానికి అలా కాపీ చేసే కళాకారుడి ప్రతిభను కూడా తక్కువగా అంచనా వెయ్యలేం. ఒరిజినల్‌లో వున్న ప్రతీ గీతా, ప్రతి బిందువు రంగుల లోని అతి స్వల్ప తేడాలు అన్నీ అతడు పునః సృష్టి చెయ్యగలగాలి – చివరికి ఆర్టిస్టు సంతకంతో సహా





# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## ఇత్తడి బొమ్మ

''ఇతడే నిన్న మా యింట్లో దొంగతనానికి వచ్చాడు. నా మీద హత్యాప్రయత్నం కూడా చేశాడు. మా ఆవిడ కేకేయ్యటంతో గోడ దూకి పారిపోయాడు. నేను అతణ్ణి వెంబడించి పట్టుకోవటానికి ప్రయత్నించాను. అనుమానమక్కర్లేదు. ఇంట్లో ఎప్పుడూ చిన్నలైటు ఒకటి వెలుగుతుంటుంది. అతణ్ణి బాగానే గుర్తుపట్టాను. దుర్మార్గుడు. నమ్మకద్రోహి. మా యింట్లోని అరుదైన పురాతన ఇత్తడి విగ్రహాలు తీసుకుని పరిగెత్తాడు. నైట్‌డ్రెస్ లోనే నేను అతడికోసం చాలాదూరం పరిగెత్తాను. టార్చ్ వేస్తూ మా ఆవిడ కూడా నా వెంటవచ్చింది. నన్ను గాయపర్చటానికి ఓ విగ్రహం నావైపు విసిరేశాడు. అదృష్టవశాత్తూ, అదో బండరాయికి తగిలి, రాపిడితో నిప్పురవ్వలు కూడా వచ్చాయి. ఆ స్పార్క్ చూసి మా ఆవిడ భయపడింది'' అంటూ పోలీసుల ముందు తన స్టేట్‌మెంట్ రికార్డు చేశాడు యింటి యజమాని.

''ఆ దొంగ మీకు ఇదివరకే తెలుసున్న మాట''.

''ఒకప్పుడు మేం మిత్రులమే. వ్యాపారంలో నన్ను మోసం చేశాడు. ఆ తర్వాత మా మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఆ కోపంతో, ద్వేషంతో ఇంత నీచానికొడిగట్టాడు నయవంచకుడు''.

''మీ మాజీ మిత్రునికి నేను కారెక్టర్ సర్టిఫికేట్ యివ్వటం లేదుగాని, అతడంటే మీకు పడదు గనక, మీరు ఈ ఆరోపణలన్నీ చేస్తున్నారు. మీ స్టేట్‌మెంట్ తప్పని నిరూపించగలను'' అన్నాడు డిటెక్టివ్.

స్టేట్‌మెంట్ అసంబద్ధంగా వుందా?

సమాధానం: అవును, ఇత్తడివల్ల రాపిడి కలగదు. అది యాంటీ ఫిక్షన్ ఏజెంట్. అందువల్ల 'స్పార్క్' వచ్చే అవకాశం లేదు.

ఏ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్స్‌కో తప్ప, ఒరిజినల్‌కూ, నకిలీకీ తెలియదు. కళాభిమానులకు శాస్త్ర జ్ఞానం వుండవలసిన అవసరం లేదు. నకిలీని చూసినంత మాత్రాన వాళ్ల సౌందర్యారాధన ఏమీ తగ్గదు.

అర్జెంటీనాలో వున్నప్పుడు ఈ ఫోర్జరీ ఆర్టిస్ట్ ఒకతను పరిచయమయ్యాడు. మొదట కోరో, మిల్లెట్ మురిలో, టిటియన్‌ల చిత్రాలు కొన్ని కాపీచేసి ఒరిజినల్స్‌గా అమ్మి బాగానే సంపాదించాను. ఇంక 'మోనాలిసా'ను ఫోర్జరీ చెయ్యాలనే వ్యూహం తట్టిన తర్వాత, అమెరికా, ఇంగ్లండులోని మిలియనీర్లను సంప్రదించి, వాళ్లకు మాత్రమే ఒరిజినల్ అందచేస్తానని, ఈ విషయం రహస్యంగా వుంచాలని వాగ్దానం చేయించుకుని దండిగా అడ్వాన్సు కూడా తీసుకున్నాను. నిజానికి దొంగిలించినట్లుగా నాటకమాడాలే తప్ప దొంగిలించక్కర్లేదని నా అయిడియా. కాని, యిలాంటివి మనం అనుకున్నట్టుగా జరగవు.

ఇక మోనాలిసా గురించి.

తెలియని వాళ్లు ఇది కాన్వాస్ మీద గీసిన బొమ్మ అనుకుంటారు. దాన్ని దొంగిలించిన వ్యక్తి, కాన్వాస్‌ను మడిచి, షర్టులో దాచుకుని వెళ్లాడని వార్తలు వ్యాపించాయి. మరికొందరు, దాన్ని చుట్టి మెటల్ సిలిండర్‌లో పెట్టి మ్యూజియం వెలుపలికి విసిరేశారని కూడా చెప్పుకున్నారు. అసలు విషయమేమంటే డావించి దాన్నొక చెక్క పలకమీద చిత్రించాడు. మూడు ఇటాలియన్ వాల్‌నట్ శ్లాబులను జోడించిన పలక అది. ఒకటిన్నర అంగుళాల మందముంటుంది. సైజు 30.32" x 20.86". కేవలం పలక బరువే 18 పౌండ్లు, వెనక సపోర్టు, ఎబొనీ ఫ్రేము బరువు 110 పౌండ్లు. గ్లాస్ బాక్సు, హాండిల్ కలిస్తే మరో నలభై పౌండ్లు పెరుగుతుంది.

ఇక, లూర్ మ్యూజియం దుర్భేద్యమని కొందరనుకుంటారు. కాని, కాస్త తెలివిగా ప్రయత్నిస్తే చాలు, అక్కడి నుండి ఏ చిత్రమైనా, ఏ శిల్పమైనా దొంగిలించవచ్చు. మ్యూజియం సిబ్బంది తెల్ల యూనిఫారం ధరిస్తారు. మనమూ అదే వేసుకుని పోతే సరి అడిగే వాడే వుండడు.

కొన్ని రోజుల కోసమైనా మోనాలిసాను అపహరించాలని నిర్ణయించుకున్న తర్వాత, ఈ పనిని నా బ్రిటిష్ మిత్రుడు పెరూజియా కప్పగించాను. అతడు మూడు సంవత్సరాలు ఆ మ్యూజియంలో పనిచేసి ఆర్ట్ డీలర్‌గా స్థిరపడ్డాడు. అతడికి ఆ భవనంలోని గదులూ, రహస్య మార్గాలూ తెలుసు. ఔత్సాహికులు బొమ్మల ముందు నిల్చుని కాపీ చేసుకుంటారు – అయితే కాపీలు ఒరిజనల్ బొమ్మ సైజు కన్న భిన్నంగా వుండాలి. అదీ నిబంధన. మోనాలిసా బరువెంతో చెప్పాను గదా. మరో యిద్దరు మనుషులను తన అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు పెరూజియా. (పోలీసుల ప్రకారం పెరూజియా ఒక్కడే దాన్ని దొంగిలించాడు. కాని అది సాధ్యం. ఏం చెప్పినా నమ్ముతారు జనం).

ఇక అసలు విషయానికొస్తే – ఆదివారం అంటే ఆగస్టు 20, 1911 నాడు మ్యూజియంను సందర్శకుల కోసం మూసివేస్తారు. అపహరణ జరిగింది. సోమవారం నాడు వారానికోసారి కళాఖండాలను శుభ్రం చేస్తారు. అంటే ఆరోజూ పబ్లిక్‌కు ప్రవేశముండదు. మ్యూజియంలోని ఒక గదిలో ఈజెల్స్, స్టూల్స్ పెడతారు. పెరూజియా అతడి అసిస్టెంట్లూ అందులో నక్కారు. వాళ్లు ముందరే ఏర్పాటుచేసుకున్న ట్రక్కు మ్యూజియం బయట వెయిట్ చేస్తున్నది.

ఆదివారమంతా ఈజెల్స్ గదిలో గడిపిన పెరూజియా, సోమవారం ఉదయం బొమ్మల్ని శుభ్రం చెయ్యటానికి, దుమ్ము దులపటానికి వచ్చిన కార్మికులలో కలిసిపోయారు. ఆ వచ్చినవాళ్లు రెగ్యులర్ సిబ్బంది కాదు. ఒకర్నొకరు గుర్తుపట్టే అవకాశం లేదు. పైగా తెల్ల యూనిఫాం కూడా వుంది. అక్కడి హెడ్‌వర్క్‌మాన్ పిక్కే, గ్రాండ్ గాలరీలో కొన్ని మరమ్మతులు చెయ్యాల్సి వుందని పని వాళ్లను పురమాయించాడు. జనం బిజీగా అటు యిటూ తిరగటం ప్రారంభమైంది.

ఆ తర్వాత సరిగ్గా 7.20 నిముషాలకు మోనాలిసా వున్న గదిలోకి ప్రవేశించి, ''మనక్కావలసిందదీ'' అంటూ తన అసిస్టెంట్లకు చూపాడు పెరూజియా. ''ప్రపంచంలోని అత్యంత ఖరీదైన చిత్రం. దాని ఖరీదు కోట్లలో వుంటుంది. అసలు వెలగట్టలేం'' అంటూ ఏదేదో వాగాడట. (ఇవన్నీ పోలీసులు చెప్పిన విషయాలు) హెడ్ వర్క్‌మాన్ పిక్కే టైం అంతజాగ్రత్తగా ఎలా జ్ఞాగ్రత్తగా ఎలా గుర్తుపెట్టుకున్నాడో గాని. తాను 8.35కు గదిలోకి ప్రవేశించినప్పుడు అదక్కడ కనిపించ లేదని అధికారులకు రిపోర్టు యిచ్చాడట. నిజానికి రిపేర్లు చెయ్యడానికి పనివాళ్లను వెంట తీసుకు వెళ్లిన అయిదు నిమిషాల్లో పెరూజియా తన పని ముగించుకున్నాడు. అయితే, దాన్ని గోడనుండి తీయటం అంత సులభమేమీ కాదు. చెప్పానుగా, అన్నీ కలిపి దాని బరువు 220 పౌండ్లు. కేవలం ఒక్క వ్యక్తే ఈ పనికి పాల్పడ్డాడని నిస్సిగ్గుగా పోలీస్ స్టేట్‌మెంట్ యిచ్చినప్పుడు అధికారుల కీ విషయం తెలియదనుకోవాలి? పియానోలు మోసుకెళతారే. ప్రత్యేక ట్రెయినింగ్ తీసుకున్న కొందరు కార్మికులు – అలాంటి వాళ్లే ఈ పని చెయ్యగలరు.

ఇక, మోనాలిసా కనిపించలేదని తెలిసినప్పుడు పిక్కే పెద్దగా కలత చెందలేదు. దాన్ని రక్షించడం తన బాధ్యత కాదు. ఆ ఒక్క మ్యూజియంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని మ్యూజియంలలో కూడా ఏదో ఒక కళాఖండం అప్పుడప్పుడూ అపహరణకు గురవుతూనే వుంది. దాన్ని, అధికారులు ''ఫొటోగ్రాఫ్'' చెయ్యటానికి తీసికెళ్లారు కాబోలు ననుకున్నాడు. పైగా కేవలం విజిటర్లు మాత్రమే అపహరిస్తారు. సిబ్బంది అలాంటి పని చెయ్యరు. అని వాళ్లకో మూఢనమ్మకం కూడా వుంది. చివరికి, మంగళవారం నాడు మ్యూజియం మళ్లీ తెరిచిన తర్వాత, మధ్యాహ్నం ఒంటి గంటకు గాని 'మోనాలిసా' అపహరణకు గురైందని అధికారికంగా ధృవీకరించలేదు, అంటే మేం మా పని ముగించి, అప్పటికి యిరవై నాలుగు గంటలు గడిచింది. ఆ సమయంలో నగర సరిహద్దులేం, దేశ సరిహద్దులు కూడా దాటవచ్చు ఎవరైనా.

అయిదు నిమిషాల్లో పని జరిగిపోయిందని చెప్పానుగా... కాని ఆ అయిదు నిమిషాలు వాళ్లెంత కష్టపడ్డారో! గోడకున్న దాన్ని కిందికి దించారు గాని ఆ తర్వాత దానికున్న షాడో బాక్స్‌నూ, ఫ్రేమ్‌నూ

విడగొట్టటానికి మాత్రం నిజంగా చెమటోడ్చారు. చేతులకు చిన్న చిన్న గాయాలయినాయి కూడా. ఆ తర్వాత వాళ్లు, గ్రాండ్ గాలరీ నుండి రెండు గజాల దూరంలో వున్న ''సేలన్ కార్''కు వచ్చి, ఇటాలియన్ ప్రాచీన కళాఖండాలు దాచిన మరో గదిలోకి ప్రవేశించారు. అక్కడనుండి ఒక భూ గర్భద్వార ముంది. కేవలం సిబ్బంది మాత్రమే ఉపయోగిస్తారు దాన్ని, అక్కడగాని, కర్ర పలకకున్న మరో హేండిల్‌ను, రక్షా కవచాన్నీ విడగొట్ట లేక పోయారు.

సరిగా, ఆ క్షణాన్నే, మేం వేసుకున్న ప్రణాళిక తప్పుదారి పట్టింది. రహస్య ద్వారం కోసం నేను అతడికో డూప్లికేట్ తాళం చెవి యిచ్చాను. కాని, దానికి బదులు అతడు బలవంతంగా తలుపు తెరిచి వెళ్లి పోవటానికి ప్రయత్నించాడు. అయితే, డూప్లికేట్ తాళం చెవి లేకపోయినా, స్క్రూడ్రైవర్ బాగానే పనికొచ్చింది. మొత్తం మీద తాళం తీశాడు. కాని డోర్‌నాబ్ స్లిప్ అయిందట. చెమట వల్లనేమో ఎంత ప్రయత్నించినా, జారిందే తప్ప పట్టు దొరకలేదు. అప్పుడు; ఏవో రిపేర్లుండి, ప్లంబర్ ఒకడు మెట్లు దిగి వచ్చాడు. తమ తెల్ల యూనిఫాంలు బొమ్మ మీద కప్పి, అతణ్ణి తలుపు తెరవమని అర్థించాడు. అలా, సిబ్బంది స్వయంగా దొంగకు సహాయం చేశారు. పైగా, ప్లంబర్ వాళ్ళతో చెప్పాడట. ''తలుపు తెరిచే వుంచండి కాసేపు. తియ్యటానికి మళ్లీ యిబ్బంది పడతారు'' అని. మొయిన్‌గోట్ వద్ద మ్యూజియంకు సంబంధించిన వ్యాన్ ఒకటుంది. అక్కడ కాపలా వున్న గార్డు, ఆ వ్యానును శుభ్రం చేద్దామని, బకెట్‌లో నీళ్లు పట్టుకు రావటానికి పక్కకెళ్లాడు. అంతే, ముగ్గురూ ఆ బొమ్మతో అదృశ్యమయ్యారు. గత నెలలో, ఫ్లారెన్స్ నగరంలో పెరూజియాను పోలీసులు అరెస్టు చేసిందాకా వాళ్లెక్కడెక్కడో తిరిగారో కూడా ఎవరికీ తెలియదు.

ఇక, ఆనాడు మ్యూజియం దాటిన పెరూజియా, అతడి అనుచరులు. వెయిట్ చేస్తున్న కారులో, పదిహేను నిమిషాల్లో నగర సరిహద్దులు దాటారు.

మరో వూళ్లో మేం మోనాలిసా కోసం వూపిరి బిగపట్టి నిరీక్షిస్తున్నాం. అప్పటికే మోనాలిసా ఫోర్జరీలు ఆరు అమెరికాలో వున్నాయి. ఒక వేళ దీన్ని కస్టమ్స్ వాళ్లు పట్టుకున్నా యిది మరో ఫోర్జరీ అనుకుని వదిలేస్తారు. చెప్పానుగా, ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్స్ తప్ప ఏది అసలు బొమ్మో, ఏది కాపీయో మరెవరూ గుర్తుపట్టలేరు. ఒరిజనల్‌ను దాచి, కాపీలను ఒరిజనల్స్‌లాగా అమ్మాలని మా ప్లాన్. ఈ పని చేసినందుకు పెరూజియాకు పెద్ద మొత్తంలోనే డబ్బిచ్చాం. కాని, మూర్ఖుడు. మా కళ్లు గప్పి, దాన్ని మేందాచిన రహస్య ప్రదేశం నుండి దొంగిలించి తను అమ్ముకోవాలనుకున్నాడు. అసలు మోనాలిసాను అమ్మటం సాధ్యమా? దాన్ని కొనగలిగిన వాళ్లు ఈ లోకంలో వున్నారా?

ఇంకా, వివరాలు చెప్పి మిమ్మల్ని విసిగించను. నా అంచనా ప్రకారం యిప్పటికి కనీసం ముప్ఫై మోనాలిసాలు ఆర్ట్ కలెక్టర్స్ వద్ద వున్నాయి. బైటికి చెప్పకపోయినా, ఎవరికి వాళ్లే తమ వద్ద వున్నదే ఒరిజనల్ అనుకుంటారు.

మా అపహరణా ప్రయత్నానికి ఏడాదిముందే అంటే 1910లో (మే నెల అనుకుంటాను) ఒక కళా విమర్శకుడు, లూర్ మ్యూజియంలో వున్న మోనాలిసా, మరొక కోటీశ్వరుడు లూయిస్ హాజీ వద్ద చూసిన మోనాలిసాకు కాపీలా కన్పిస్తున్నదని ఒక ప్రముఖ పత్రికకు వ్యాసం కూడా రాశాడు. ఆయన వాదనకు ఆధారం ఏమంటే, హాజీ వద్ద వున్న బొమ్మలో లేని రెండు ఆకుపచ్చ బిందువులు, మ్యూజియంలోని బొమ్మలో ఎడమ వైపు వున్నాయని, కాపీ చేసినప్పుడు మాత్రమే యిలాంటి పొరబాట్లు జరుగుతాయని ఒక వాదన. కావచ్చు. కాకపోవచ్చు.

ఇప్పుడు, లూర్ అధికారులు తను వద్ద వున్న మాస్టర్ పీస్‌కు ఫోరెన్సిక్ పరీక్షలు జరిపించటానికి సిద్ధ పడతారా?

అదెంత పెద్ద రిస్కో ఎవరైనా వూహించగలరు. అక్కడ వున్నదే ఒరిజనల్ అని నమ్మితే తప్ప మ్యూజియం నెవరూ దర్శించరు.

*

*(1932 నాటి ఒక కథ ఆధారంగా)*

